క్లుప్తంగా

మూడు లారీలు సీజ్

తెనాలిరూరల్: అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న లారీలను ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. కొల్లిపరలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మూడు లారీలు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడాన్ని గుర్తించారు. వాటిని సీజ్ చేసి, కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ సహకారంతో పట్టణంలోని క్షయ బాధితులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ పి.రవికుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడ-చెన్నై రైలు మార్గంలో వలివేరు గేటు, చుండూరు స్టేషన్ల మధ్య నడిగడ్డపాలెం రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడి కుడి చేతిపై 'రమణమ్మ' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రైలు నుంచి జారి పడటంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వృత్తి విద్యా కళాశాలకు ల్యాప్‌టాప్స్ బహూకరణ



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విద్యార్థినుల ప్రయోజనార్థం విశ్వాస్ కంప్యూటర్స్ అధినేత గుర్రం విశ్వేశ్వరరావు 10 ల్యాప్‌టాప్స్ అందజేశారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. ఆనందబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థినుల ప్రయోజనార్థం తాను చేసిన విజ్ఞప్తిపై తన శిష్యుడైన విశ్వేశ్వరరావు ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అందించడం అభినందనీయమని తెలిపారు. నీతి, నిజాయతీ, నిబద్ధతతో కూడిన నడవడిక మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని, ఇందుకు విశ్వేశ్వరరావు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాత విశ్వేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



పాత గుంటూరు: నగరంలో హజరత్ సయ్యద్ షాహ మొహిద్దీన్ బాద్‌షా సేవా సమితి ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎత్తు రోడ్డులోని హజ్రత్ సయ్యద్ షా మొహిద్దీన్ బాద్‌షా దర్గా ఆవరణలో సోమవారం హజరత్ సయ్యద్ మహబూబ్ సుభాని గౌసే సమ్‌దాని కుతుబే రబ్బాని గ్యార్మీ షరీఫ్ వేడుకల్ని పురస్కరించుకుని సమితి సభ్యులు, భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ: అతివేగంగా వస్తున్న బైక్ వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాదాసు ఏసురత్తమ్మ (74) ఆదివారం రాత్రి చర్చి నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ప్రధాన రహదారి దాటుతుండగా అమరావతి నుంచి గుంటూరు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు చర్యలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యల్లో ఒకటైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శివకుమార్ పర్యటించారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, డీఎస్పీ బి.జనార్ధనరావు, పట్టణ సీఐలు, పార్టీ నాయకులతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. పట్టణంలోని చెంచుపేటలో ఉమేష్ చంద్ర విగ్రహం, కొత్త వంతెన, మార్కెట్ వంతెన, బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి, గంధీ చౌక్ సమీపంలోని పాత అశోక్ పెన్ వర్క్స్ సెంటరు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అక్కడి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను కొంత వరకైనా అధిగమించేందుకు గాను ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం సీసీఎల్ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ రూ. 30 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అతి కొద్ది రోజుల్లో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే వెంట సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు, ఎస్. రమేష్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, మద్దాళి శేషాచలం, అక్కిదాసు కిరణ్‌కుమార్, మల్లెబోయిన రాము, చుండూరు సాయి, షేక్‌మీరావలి ఉన్నారు.

స్పందన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదుల్ని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని నగర ఇంచార్జి కమిషనర్ పి.వి.కె. భాస్కర్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు కూడా విభాగాల వారీగా ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 24 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 9, ఇంజినీరింగ్ విభాగానికి- 7, రెవెన్యూ విభాగానికి- 6, ప్రజారోగ్య విభాగానికి- 2 చొప్పున ఉన్నాయని ఆయన వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) సీహెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్ ఆల్గరిథమ్స్- అప్లికేషన్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రిన్సిపల్ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆర్. వసంత, డాక్టర్ జి. నీలిమ రాసిన «మెషీన్ లెర్నింగ్ అల్గరిథమ్స్ – అప్లికేషన్స్» పాఠ్య పుస్తకాన్ని సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో ఒక ముఖ్య భాగమని పేర్కొన్నారు. దీన్ని సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, మెడికల్ డయాగ్నోస్టిక్స్, డ్రోన్స్, జీపీఎస్ వంటి వాటిలో ఉపయోగిస్తున్నారని వివరించారు. పాఠ్య పుస్తకంలో మెషీన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్‌ను విశదీకరించామని రచయితలు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, డాక్టర్ బి.బసవేశ్వరరావు, డాక్టర్ కె. లావణ్య, డాక్టర్ సూర్యకామేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన జర్మనీ వర్సిటీ విద్యార్థులు



జర్మనీ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులతో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: జర్మనీలోని బెర్లిన్ నగరంలో విద్యనభ్యసిస్తున్న అనేక విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని సందర్శించారు. అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ థామస్ బెర్గర్ నేతృత్వంలో వచ్చిన ఈ బృందం యూనివర్సిటీలోని వివిధ విభాగాలలో జరుగుతున్న అధ్యయనం, పరిశోధనల గురించి వివరించామని, విద్యార్థుల యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయి విజయ్‌ను కలసి ఆయా విభాగాలలో జరుగుతున్న అధ్యయనం గురించి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య పరస్పరం విద్యార్థుల మార్పిడికి సంబంధించిన ఒక అవగాహన జరిగిందని తెలిపారు. విదేశీ భాషల విభాగ అధ్యక్షుడు డాక్టర్ జమిందారు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలలో సత్యసాయి విద్యార్థుల ప్రతిభ

అండర్-14, 17 విభాగాల్లో 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ రాయపాటి శ్రీనివాస్

తాడికొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి అండర్-14, అండర్-17 విభాగాల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిచ్చి తమ పాఠశాలలో మంచి తర్ఫీదు ఇస్తున్నందున విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను వారికి తర్ఫీదు అందించిన పీఈటీ అనీల్ కుమార్‌ను డైరెక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో పాటు కరస్పాండెంట్ మోహనసాయి కృష్ణ, సీఈఓ అమల, ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం బాబూరావును ఘనంగా సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి ఎంపీపీఎస్ (ఎఎ) పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన బాబూరావు మాస్టర్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. 10 సంవత్సరాల క్రితం కుంచనపల్లి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన బాబూరావు స్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఇంటింటికి తిరిగి చిన్నారులను పాఠశాలకు తీసుకువచ్చి విద్య నేర్పించారు. దీంతో బాబూరావు మాస్టారు బదిలీ అయ్యారని తెలియగానే ఆ గ్రామంలో ప్రస్తుతమున్న విద్యాకమిటీతో పాటు గతంలో చదువుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లి ఎంఈఓ-2 దోమ నాగేశ్వరరావు విచ్చేశారు. ఉపాధ్యాయులు వి.దీపలత, జి.శోభాదేవి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కుంచనపల్లి పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): మండలంలోని చినకోండ్రుపాడు శివారుల్లోని ఖాళీ ప్రదేశాల్లో కొంత మంది రహస్యంగా కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం ఎస్ఐ డి. రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1010 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నమన్మోహన్



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చుక్క రత్న మన్మోహన్ సూచించారు. పాండురంగపేటలోని షాదీ ఖానాలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ జనరల్ ఓపీ 69, డెర్మటాలజీ ఓపీ 28, రేడియాలజీ ఓపీ 26, అప్తమాలజీ ఓపీ 68 మందికి ఇక్కడ వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, డాక్టర్ షేక్ బీబీజాన్, డాక్టర్ వి మహిత, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు కోటేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న ఆరాధ్యుల కోటేశ్వరరావు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు అమెరికాలోని డెలావర్ స్టేట్‌లో గల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. పెర్ఫామింగ్ ఆర్ట్స్ కేటగిరీలో ఆయన ఈ గౌరవానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నెల 28న పాండిచ్చేరిలోని కంబన్ కలైరంగమ్ ఆడిటోరియంలో జరిగిన యూనివర్శిటీ స్నాతకోత్సవంలో యూనివర్శిటీ వ్యవస్థాపకుడు/ చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయేల్, వైస్ చాన్సలర్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.వెంకటేశన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ విశ్రాంత ముఖ్య కార్యదర్శి/ ప్రత్యేక కమిషనర్ కె.సంపత్‌కుమార్, ప్రొఫెసర్ జె.రంగనాథన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కళాకారుడు కోటేశ్వరరావు సోమవారం తెనాలిలో ఈ వివరాలను విలేకరులకు తెలియజేశారు.

15లోగా రేషన్ పంపిణీ చేయాలి

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని ఎండీయూలు, రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కె.రవిబాబు వారికి పలు సూచనలు చేశారు. 1 వ తేదీ నుంచి 15 లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ)ల ఆపరేటర్లే ఖచ్చితంగా సరుకుల పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు.

పోలీసు సిబ్బంది కవాత్తుల ప్రదర్శన



మంగళగిరి: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో కవాత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అధికారులు కొనియాడారు. బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

గుంటూరు రూరల్: వాకింగ్ చేస్తున్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నగర శివారులోని బొంతపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లింది. అదే సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి తాపీ పనుల నిమిత్తం వచ్చిన పరదేశికాప సమర్థార్ ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల జాతీయ ఐక్యత ప్రదర్శన



ర్యాలీని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు, రమేష్ చంద్ర

గుంటూరు ఎడ్యుకేషన్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరు ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జేకేసీ కళాశాల నుంచి విద్యార్థులతో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రిన్సిపాల్ ఐ.నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఐక్యత ప్రాముఖ్యత వివరించేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో తమ కళాశాల విద్యార్థులు సైతం పాల్గొంటున్నారన్నారు. మన దేశ సంస్కృతిలోనే ఐక్యత ఇమిడి ఉందని తెలిపారు. సీబీసీ గుంటూరు అధికారి ఆర్.రమేష్ చంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం వివిధ సంస్థానాలను ప్రస్తుత ప్రజాస్వామిక దేశంగా ఏకతాటిపైకి తీసుకురావడంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సాహసోపేతంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన జయంతి రోజైన అక్టోబర్ 31ని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. నా దేశం–నామట్టి కార్యక్రమంలో భాగంగా రెండు నెలలుగా రాష్ట్రంలో వివిధ పంచాయతీల నుంచి సేకరించిన పదివేలకు పైగా అమృత కలశాలు మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలోని అమృతవాటికలో ఐక్యం కానున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ర్యాలీలో జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఖాదీ



ఖాదీ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య సంగ్రామంలో ఖాదీ వస్త్రం కీలకపాత్ర పోషించిందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం పట్టాభిపురంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాదీ మహోత్సవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిషు పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు మహాత్మాగాంధీ నాయకత్వంలో ఖాదీ ఉద్యమం ఎంతో కీలకంగా మారి, భారతీయుల్లో దేశభక్తి భావం పెంపొందింపచేసిందని తెలిపారు. విదేశీ వస్త్రాలను వ్యతిరేకిస్తూ, స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించి వ్యాపార రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికిందని వివరించారు. మహాత్ముని సేవలకు గుర్తింపుగా గాంధీ జయంతి నుంచి ఈనెల 31 వరకు ఖాదీ వస్త్ర విశిష్టత, ప్రయోజనాలను తెలియజేసే కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా ప్రతి విద్యాసంస్థలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మన దేశం–మన ఖాదీ, ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్ అనే నినాదాలతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయ శైలజ, ఆంగ్ల విభాగ అధ్యాపకురాలు పి. నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటే కార్యాలయం.. అంతా గందరగోళం



గుంటూరు అర్బన్ ఎంఈఓ కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో ఎంఈవో కార్యాలయ విభజనపై విద్యాశాఖాధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గుంటూరు అర్బన్, రూరల్ కలుపుకుని ఉమ్మడిగా ఉన్న కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ఈస్ట్, వెస్ట్‌గా విభజించి ఏడాది గడిచిపోయింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రమైన గుంటూరు నగర, రూరల్ పరిధిలో 505 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేతనాల బిల్లులు మంజూరు, సర్వీసు విషయాల్ని ఎంఈవోలే పర్యవేక్షిస్తున్నారు. అయితే, గతంలో అర్బన్, రూరల్ కలుపుకుని ఒక్క ఎంఈవోనే మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించిన పరిస్థితి ఉండేది. పని భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతి మండలానికి కొత్తగా ఎంఈవో-2 పోస్టును మంజూరు చేసింది. దీంతో గుంటూరు ఈస్ట్, వెస్ట్‌లలో ఎంఈవో పోస్టులు నాలుగుకు చేరాయి. ప్రభుత్వం సృష్టించిన రెండో ఎంఈవో పోస్టుల ద్వారా మండల విద్యాశాఖాధికారులకు ఉపశమనం కలిగింది.


విధుల నిర్వహణకు ఇబ్బందులు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకర్గాలతో పాటు ప్రత్తిపాడు పరిధిలోకి వచ్చే రూరల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గుంటూరు సైతం ఈస్ట్, వెస్ట్ పరిధిలోకి వస్తున్నాయి. నలుగురు ఎంఈవోలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. భౌగోళికంగా ప్రస్తుతం కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ఎంఈవో కార్యాలయంలో వెస్ట్ పరిధిలోకి వస్తుంది. కాగా నలుగురు ఎంఈవోలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే గదిలో నాలుగు కుర్చీలు వేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు.

తూర్పులో కార్యాలయం ఏర్పాటు అవశ్యం

గుంటూరు నగరంలో 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాల్ని పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క ఎంఈవో కార్యాలయం నుంచే జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలకు పంపి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాల్ని సకాలంలో సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల్ని ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించే విధుల్ని ఎంఈవోలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా కేంద్రం కావడంతో పాటు పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తగా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పులో నూతనంగా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీంతో పాటు ఆర్జేడీ వి.ఎస్. సుబ్బారావు, డీఈవో పి. శైలజకు సూచించారు. అయినప్పటికీ విద్యాశాఖాధికారుల్లో చలనం లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది.

శలపాడులో గడ్డివామి, పూరిల్లు దగ్ధం



శలపాడు(చేబ్రోలు): అగ్ని ప్రమాదంలో పూరిల్లు, గడ్డి వామి దగ్ధమైన ఘటన చేబ్రోలు మండలం శలపాడులో సోమవారం రాత్రి జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగి పులి అంకమ్మస్వామికి చెందిన పూరిల్లు పూర్తిగా కాలి బూడిదైంది. వస్తువులతో పాటు రెండు నీళ్ల ఇంజిన్లు, విలువైన పత్రాలు కాలిపోయాయి. మంటలు సమీపంలోని ఐదు ఎకరాల్లోని గడ్డివామికి అంటుకోవడంతో రూ.లక్షన్నర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదం నుంచి ఆరు మూగ జీవాలు ప్రాణాలతో బయటపడ్డాయి. పూరిపాకలో ఉన్న ఎద్దులు, పశువులను రక్షించడం కోసం యువకుడు యుగంధర్ ధైర్యంతో మంటల సమీప ప్రాంతానికి వెళ్లి కట్టేసిన తాళ్లను తొలగించటంతో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. బయటకు తీసుకువచ్చే ప్రయత్నంలో అతడి కాళ్లు, చేతులకు గాయాలవ్వడంతో తెనాలి వైద్యశాలకు తరలించారు. తెనాలి అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు.